క్లుప్తంగా

వేసవి శిక్షణ తరగతులు

ప్రకాశం నగర్: గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం దానవాయిపేటలోని రాజమహేంద్రవరం మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు విశ్రాంత తెలుగు పండిట్ ముంగండి సూర్యనారాయణ నీతి కథలు, తెలుగు పద్యాలు, పాటలు, సూర్య నమస్కారాలు, పొడుపు కథలను చెప్పారు. విద్యార్థులతో కథలు చదివించారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ అబ్బిరెడ్డి చంద్రపద్మాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆకుల వీర్రాజు పరామర్శ



సూర్యనారాయణను పరామర్శిస్తున్న ఆకుల వీర్రాజు

కడియం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు యర్రా సూర్యనారాయణను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు సోమవారం పరామర్శించారు. మురమండలోని సూర్యనారాయణ స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీర్రాజు వెంట బోణం సత్యనారాయణ, జ్యోతుల అర్జున్, స్థానిక నాయకులు ఉన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

సీటీఆర్ఐ: స్థానిక జమిందారు మెట్టలోని చైతన్య హాస్పటల్ పక్కనే గల నారాయణాద్రి, అంజనాద్రి, శేషాద్రి అపార్ట్‌మెంట్ (నాసా) ప్రాంగణంలోని భూనీశా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ జరగనున్నాయి. నాసా అసోసియేషన్, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ధ్వజారోహణంతో పూజలు మొదలవుతాయి. 30వ తేదీ వరకూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సంతానం కోసం గరుడ ప్రసాదం తీసుకునే భక్తులు ముందుగా ఆలయ కమిటీని, లేదా అర్చకులను సంప్రదించాలి. తిరువీధి మహోత్సవం దివంగత మాజీ కార్పొరేటర్ నండూరి వెంకట రమణ మిత్రబృందం ఆధ్వర్యంలో జరుగుతుంది.

నేటి నుంచి యేసయ్య మహాసభలు

కడియం: వేమగిరితోటలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు యేసయ్య శుభవార్త మహాసభలు నిర్వహిస్తున్నట్టు వేమగిరి పెంతుకోస్తు ప్రార్థనా మందిరం సంఘకాపరి పి.ప్రసాద్ తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో జరిగే ఈ మహాసభలకు వివిధ ప్రాంతాల నుంచి క్రైస్తవ ప్రముఖులు విచ్చేసి ప్రసంగిస్తారన్నారు.

లారీని ఢీకొన్న స్కూటీ

గండేపల్లి: లారీని స్కూటీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డు సేఫ్టీ సిబ్బంది కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ గండేపల్లి వచ్చేసరికి వెనుక వస్తున్న స్కూటీ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఒక వ్యక్తి, ఒక మహిళకు గాయాలుకాగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అన్నవరంలో మంత్రి వేణు పూజలు



సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న మంత్రి వేణు దంపతులు

రాజమహేంద్రవరం రూరల్: అన్నవరంలోని సత్యనారాయణస్వామిని సోమవారం రాష్ట్ర బీసీ, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించి, పండితుల ఆశీర్వచనం అందుకున్నారు.

22 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో సోమవారం జరిగిన గణిత పరీక్షకు 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. గణితం పేపర్–1 పరీక్షకు 238 మందికి 220 మంది, మధ్యాహ్నం జరిగిన గణితం పేపర్–2 పరీక్షకు 68కి 64 మంది హాజరయ్యారన్నారు.

పుస్తక పఠనంతో మేలు

బిక్కవోలు: విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో మేలు చేస్తుందని కొంకుదురు శాఖా గ్రంథాలయాధికారి ఎస్.బాల అన్నారు. మండలంలోని కొంకుదురు శాఖా గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణా తరగతుల్లో సోమవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు, జనరల్ నాలెడ్జ్ అంశాలపై శిక్షణ ఇచ్చారు.

పేదలందరికీ మెరుగైన వైద్యం

- ఆరోగ్య సురక్షకు మంచి స్పందన
- తరలివస్తున్న ప్రజలు



ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన ప్రజలు (ఫైల్)

కంబాలచెరువు: పేదలందరికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోంది. దీనిలో భాగంగా అనేక వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, స్పెషలిస్టు వైద్యులు సేవలు అందిస్తున్నారు. ప్రజలు కూడా తరలివచ్చి ఈ సేవలను ఉపయోగించుకుంటున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఆరోగ్య సురక్ష కార్యక్రమం వచ్చే నెలలో ముగియనుంది. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుంది.

మెరుగైన వైద్యం

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 150 పైగా హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. సచివాలయం అనుసంధానంగా హెల్త్ వర్కర్లు, వైద్యులు పనిచేస్తున్నారు. రోగి వద్దకే వైద్యులు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారు కూడా లబ్ధి పొందుతున్నారు. వారికి అవసరమైన అన్ని వైద్య చికిత్సలు, సదుపాయాలను వైద్య సిబ్బంది సమకూర్చుతున్నారు. కంటి సమస్యలతో బాధపడే వారికి కార్పొరేట్ వైద్యం అందుతోంది. దీనిలో భాగంగా ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించి కళ్లజోళ్లు అందజేస్తున్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అర్బన్, రూరల్ ఏరియాల్లో క్యాంపులు నిర్వహించి ప్రతి వ్యక్తికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డివిజన్ పరిధిలో 1,02,300 మందికి వైద్య సేవలు పొందారు. వారిలో ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు 10,300 మంది ఉన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో 4,200 మందికి కళ్లద్దాలు అందించారు. సుమారు 1,230 మందికి కాంటరాక్ట్ ఆపరేషన్లు చేశారు.

వైద్యసేవలు



"కంటి వెలుగు కార్యక్రమంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తిస్తున్నాం. వారికి పూర్తి వైద్యం అందిస్తున్నాం. అవసరమైన వారికి కళ్లద్దాలను అందిస్తున్నాం. ఎవరైనా కంటి సమస్యలతో బాధపడుతుంటే ఆలస్యం చేయకుండా కంటి వెలుగు ప్రోగ్రామ్ ద్వారా వైద్య సహాయం పొందండి."

– డాక్టర్ లావణ్య, కంటి వెలుగు ప్రొగ్రాం కో మేనేజర్

2న కౌంటింగ్ ట్రయల్ రన్



ట్రయల్ రన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల కౌంటింగ్ జూన్ 4న జరగనున్న విషయం తెలిసిందే. దీనిని సజావుగా, సమర్థవంతంగా నిర్వహించడంలో భాగంగా జూన్ 2న ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత సోమవారం రాత్రి జిల్లా ఎస్పీ పి.జగదీష్, వివిధ అనుబంధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎం యూనిట్లను తరలించడం, కౌంటింగ్ పూర్తయిన తరువాత తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలింపు వంటి వాస్తవ పరిస్థితిని గమనించి, ఏవైనా లోటుపాట్లు ఉంటే అధిగమించడం కోసం ఈ ట్రయల్ రన్ ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, ఆర్డీఓ చైత్రవర్షిణి, డీపీఓ డి.రాంబాబు పాల్గొన్నారు.

రోగులకు అన్నసమారాధన



అన్నదానం చేస్తున్న జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: జవహర్ వాకర్స్ క్లబ్ 17 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులకు, వారి సహాయకులకు అన్నవితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ మాట్లాడుతూ క్లబ్‌ను స్థాపించిన నాటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. శ్రీగౌతమి జీవకారుణ్య సంఘంలో వృద్ధుల కోసం షెల్టర్ నిర్మించామన్నారు. ప్రతి నెల ఒక్కొక్క విభాగానికి చెందిన డాక్టర్లను తీసుకుని వచ్చి క్లబ్ సభ్యులకే కాకుండా మిగిలిన వారికి కూడా ఉచిత పరీక్షలు చేయిస్తున్నామన్నారు. నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామన్నారు. సెక్రటరీ సూర్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు వాసు, జాయింట్ సెక్రటరీ శేషగిరి, సర్దార్‌జీ, సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



గంజాయి, నిందితుడితో ఎస్సై అంకారావు, డిప్యూటీ తహసీల్దార్ రమ్య

రాజమహేంద్రవరం రూరల్: ట్రావెల్ బ్యాగ్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని సోమవారం మధ్యాహ్నం మోరంపూడి సెంటర్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 10.730 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బొమ్మూరు ఎస్సై ఆర్.అంకారావు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన అజ్మాయ్ పాషా విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గుర్తు తెలియని రైతు వద్ద గంజాయిని కొనుగోలు చేశాడు. దానిని ట్రావెల్ బ్యాగులో దాచి బెంగళూర్ వెళుతున్నాడు. ప్రయాణంలో అతడు లారీలు ఎక్కుతూ దిగుతూ వెళుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అజ్మాయ్ పాషా మోరంపూడి సెంటర్‌లో దిగి నడుచుకుంటూ ముందుకు వెళ్తున్నాడు. ఈలోపు పోలీసులకు అందిన సమాచారం మేరకు మహాలక్ష్మి మార్కెట్‌కు వచ్చేసరికి అతడిని బొమ్మూరు ఎస్సై అంకారావు, సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. రూరల్ డిప్యూటీ తహసీల్దార్ రమ్య సమక్షంలో తనిఖీ చేశారు. ట్రావెల్ బ్యాగ్‌లోని 10.730 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, పాషాను అరెస్టు చేశారు. గంజాయి విలువ రూ.64,380 ఉంటుందని ఎస్సై అంకారావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నెలాఖరులోగా నాడు–నేడు పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

రంగంపేట: మన బడి నాడు–నేడు పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు సూచించారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మన బడి–నాడు నేడు పనుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఏ పనులు ఎంత వరకూ పూర్తి చేశారు?ఇంకా చేయాల్సిన పనులేంటి? వాటికి అవసరమైన నిధుల వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు, ఆయా పనుల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బిల్లులు, ఫొటోలు అప్‌లోడ్ చేయడంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిషోర్ సూచించారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారి–2 పి.మధుసూదనరావు, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

- కౌంటింగ్ రోజు ప్రశాంతంగా ఉండాలి
- డీఎస్పీ అంబికా ప్రసాద్
- కడియంలో పోలీసుల మాక్ డ్రిల్



కడియంలో మాక్ డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ అంబికాప్రసాద్ తదితరులు



మాక్ డ్రిల్‌లో భాగంగా గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందిస్తున్న పోలీసులు



మాక్‌డ్రిల్‌లో ఆందోళనకారులను అదుపు చేస్తున్న పోలీసులు

కడియం: దక్షిణ మండలం డీఎస్పీ అంబికా ప్రసాద్ నేతృత్వంలో స్థానిక పోలీసులు, ప్రత్యేక పోలీసు బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కడియం హైస్కూల్ రోడ్డులో మాక్ డ్రిల్ నిర్వహించారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పోలీసులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారనే విషయాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. ముందుగా ఆందోళనకారులు నినాదాలు చేయడం, వారిని పోలీసులు వారించడం, పరిస్థితి అదుపు తప్పడంతో లాఠీచార్జి, అనంతరం పోలీసుల కాల్పులు, గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి, ఆసుపత్రికి తరలించడాన్ని ప్రదర్శించారు. అనంతరం డీఎస్పీ అంబికా ప్రసాద్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపును సక్రమంగా నిర్వహించడమే పోలీసుల ముందున్న లక్ష్యమన్నారు. కౌంటింగ్ రోజు ప్రజలు క్రమశిక్షణతో పోలీస్ వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలలో ఉన్న భయాన్ని తొలగించేందుకు నిరంతరం వారితో ఉంటూ మాక్ డ్రిల్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓట్లు లెక్కింపు ప్రక్రియ జరగాలని, శాంతి భద్రతలకు ఎవరు ఆటంకం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. లెక్కింపు రోజున ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా వాటిని అధిగమించడానికి తాము సిద్ధంగా ఉన్నారన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రౌడీ షీటర్లు, అనుమానితులను బైండోవర్ / హౌస్ అరెస్ట్ చేస్తామని, అలాగే ఓట్లు లెక్కింపు ముగిసిన అనంతరం ఎటువంటి అల్లర్లకు తావులేకుండా కార్యకర్తలను అదుపులో ఉంచుకునే బాధ్యత రాజకీయ పార్టీల నాయకులదేనన్నారు. ఎస్పీ జగదీష్, కలెక్టర్ మాధవీలత ఆదేశాల మేరకు మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్సైలు టి.కృష్ణసాయి, దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కందుకూరి సేవలు చిరస్మరణీయం

- కొనియాడిన వక్తలు
- యుగపురుషుడికి నివాళి



కందుకూరి దంపతుల సమాధులకు పుష్పాంజలి ఘటిస్తున్న రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు



నివాళులర్పిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు



ఎస్‌కేవీటీ స్కూల్లో కందుకూరి వర్ధంతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సీటీఆర్ఐ: యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులు సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా సోమవారం నగరంలోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌కేవీటీ కళాశాలలోని ఆనంద్ గార్డెన్‌లో ఉన్న కందుకూరి దంపతులు సమాధులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు పుష్పాంజలి ఘటించారు. ఎస్‌కేవీటీ కళాశాల తెలుగుశాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

▸▸ ఆనంద్ గార్డెన్స్‌లోని కందుకూరి సమాధులకు రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, హితకారిణి సమాజం సహాయ కమిషనర్, కరస్పాండెంట్ సింగం రాధ తదితరులు పూలమాలలు వేశారు. రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వితంతు పునర్వివాహాలు, స్త్రీ విద్య, బాల్య వివాహాల నిర్మూలనకు కందుకూరి వీరేశలింగం ఎంతో కృషి చేశారన్నారు.

▸▸ కోటిపల్లి బస్టాండ్ వద్ద గల కందుకూరి విగ్రహానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సానబోయిన రామారావు నివాళులర్పించారు. ఎల్‌వీ ప్రసాద్, కేకే సంజీవరావు పాల్గొన్నారు.

▸▸ తన యావదాస్తిని ప్రజల ఉపయోగార్థం దానం చేసిన గొప్ప విద్యాదాత కందుకూరి వీరేశలింగం అని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. కందుకూరి నిర్మించిన స్థానిక టౌన్ హాల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ అధ్యక్షుడు జగన్నాథం వెంకటరెడ్డి , టౌన్ హాల్ ట్రస్ట్ బోర్డు కార్యదర్శి జమ్మి రామారావు, టౌన్ హాల్ లైబ్రేరియన్ వీటీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యాలయాలలో..

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో కందుకూరి వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వీరేశలింగం విగ్రహానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు అప్పారావు నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు

కడియం: కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. 2005 – 06లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వారందరూ తమ స్నేహితులను చూడాలని తరలి వచ్చారు. దాదాపు ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకొని తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక వీరవరం రోడ్డులోని జీఎస్ఆర్ కల్యాణ మంటపం వద్ద కలుసుకుని సందడి చేశారు. ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ వివరాలు తెలుసుకున్నారు. ఆనాటి అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. తొలుత తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

లక్ష్య సాధనకు నిరంతరం కృషి అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించడానికి నిరంతరం కృషి చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ పాఠశాలలలో 500 మార్కులు మించి సాధించిన 151 విద్యార్థులకు జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కల్పించడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలతో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్పొరేషన్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ ఏటా నగరపాలక సంస్థ పాఠశాలలలో అత్యున్నత ప్రతిభ చూపించిన విద్యార్థులకు నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. అతి తక్కువ ఫీజులను తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం భరిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి, అంకితభావంతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారన్నారు. ఈ కౌన్సెలింగ్‌కు 17 కళాశాలల యాజమాన్యాలు హాజరయ్యాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, మేనేజర్ అబ్దుల్ మాలిక్ అస్ఫర్, ఉపవిద్యాధికారి దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు



బూరుగుపూడిలోని ఎస్‌కే ఇండస్ట్రీస్‌లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మధురపూడి: ప్రభుత్వ అనుమతులు లేకుండా కూల్‌డ్రింక్స్, సోడా పరిశ్రమలను నిర్వహిస్తే సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ఎస్‌కే ఇండస్ట్రీస్ (సోడా, సాఫ్ట్‌డ్రింక్స్ యూనిట్)ను విజిలెన్స్, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ, రెవెన్యూ శాఖల అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇండస్ట్రీస్‌లో పెట్ బాటిళ్లపై బ్యాచ్ నంబర్లు లేకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు. అలాగే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాలుగు లెమన్ బాటిళ్ల నమూనాలను విశ్లేషణ నిమిత్తం సేకరించారన్నారు. ధ్రువీకరించని తూకం యంత్రాన్ని ఉపయోగిస్తున్నందున లీగల్ మెట్రాలజీ అధికారులు మరో కేసు నమోదు చేశామన్నారు. అనధికారిక కూల్ డ్రింక్స్, సోడా పరిశ్రమలపై నిఘా కొనసాగుతోందన్నారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ, నవీన్, వలీ, కిషోర్ పాల్గొన్నారు.